క్లుప్తంగా

నాన్న-నేను వెబ్‌సిరీస్ షూటింగ్ ప్రారంభం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద ఆదివారం నాన్న-నేను వెబ్‌సిరీస్ షూటింగ్‌ను ప్రారంభించారు. మాజీమంత్రి నెట్టెం రఘురాం క్లాప్ కొట్టారు. ఈసందర్భంగా నెట్టెం మాట్లాడుతూ నాన్న ప్రేమ, త్యాగం గొప్పతనాన్ని ప్రతిబింబించేలా ఈవెబ్ సిరీస్ సమాజానికి మంచి సందేశం ఇస్తుందన్నారు. గ్రామానికి చెందిన వేణు ఈ వెబ్‌సిరీస్‌కు దర్శకత్వం వహించడం అభినందనీయమన్నారు. వేణు మాట్లాడుతూ వెబ్ సిరీస్‌లో నటించనున్న నటీనటుల పేర్లను త్వరలోనే తెలియజేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు కాకాని శ్రీనివాసరావు, నూతలపాటి చెన్నకేశవ రావు, వాసిరెడ్డి బెనర్జీ, మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి, గ్రామపెద్దలు కాకాని కోటేశ్వరరావు, దివ్వెల మల్లేశ్వరరావు, నల్లూరి అప్పారావు, బరిగెల వెంకయ్య పాల్గొన్నారు.

శ్రీరామకోటి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



నందిగామటౌన్(నందిగామరూరల్): పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి రి ఆలయంలో 72వ శ్రీరామ కోటి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సీతారామ సంకీర్తన సంఘం అధ్యక్షుడు దుద్దు నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి ఆరో తేదీ నుంచి ఆరు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. మహోత్సవాల సందర్భంగా దేవతామూర్తుల దివ్య కళ్యాణంతోపాటు ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకుడు దివి కృష్ణమాచార్యులు, సంఘ సభ్యులు కొత్త ప్రభాకర్, ఊటుకూరు సత్యనారాయణ, వనమా బుల్లెబ్బాయ్, శ్రీనివాసరావు, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మ నామస్మరణతో మార్మోగిన ముండ్లపాడు



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): అమ్మయే శరణం తిరుపతమ్మ...స్వామియే శరణం గోపయ్య అంటూ గ్రామంలో శనివారం రాత్రి శ్రీతిరుపతమ్మ అమ్మవారి దీక్షా స్వాముల భజనా కార్యక్రమం కనుల పండువగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అమ్మవారు, స్వామివార్ల ప్రతిమలను ఉంచి పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయ అర్చకులు మర్రెబోయిన ద్వారక నేతృత్వంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు చెందిన చిన్ని బృందం ఆలపించిన భక్తిపాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామంలోని దీక్షా స్వాముల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భజనా కార్యక్రమంలో పారామౌంట్ కంపెనీ అధినేత వెనిగళ్ల సురేష్, పెద్దసంఖ్యలో దీక్షా స్వాములు, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటోడ్రైవర్ గాయపడిన ఘటన గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం గుణదల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపురానికి చెందిన మస్తాన్‌వలి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 1వ తేదీన ఎనికేపాడులోని ఫంక్షన్‌కు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ఫంక్షన్ నుంచి తిరిగి వస్తున్న క్రమంలో బీఆర్టీఎస్ రోడ్డు ఆంజనేయ స్వామి విగ్రహం వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మస్తాన్ వలీని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి రైతు దిగాలు

- మిర్చికి లభించని గిట్టుబాటు ధర...
- క్వింటా రూ.11వేలకు మించని వైనం
- గతేడాది క్వింటా రూ.19వేలు పైమాటే
- ఈ ఏడాది పూర్తిగా పడిపోయిన ధరలు
- మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వం
- ఆందోళనలో మిర్చి రైతులు



కల్లంలో ఆరబోసిన మిర్చి

నందిగామరూరల్: ప్రకృతి విపత్తులు, తెగుళ్ల, చీడపీడలను తట్టుకుని ఆరుగాలం పండించిన రైతన్నకు పంట చేతికొచ్చే సమయానికి నష్టాలే పలుకరిస్తున్నాయి. దిగుబడి బాగుంటే ధర లేక.. ధర ఉంటే దిగుబడి రాక ఏటా నష్టాలే మిగులుతున్నా ఏఏటికాయేడు ఈ ఏడాదైనా కలిసి రాకపోతుందా? అని భగవంతునిపై భారం వేసి సాగు చేస్తున్న రైతులకు చివరికి అప్పుల తిప్పలు.. కంటకన్నీరే మిగులుతోంది. లాభాల సంగతి అటుంచి సాగుఖర్చులు సైతం రాకపోతుండటంతో మిర్చి రైతులు తీవ్రనష్టాల పాలవుతున్నారు. ఈ ఏడాది మిర్చి సాగు ప్రారంభంలోనే వచ్చిన అకాల వర్షాలు, వరదలకు పంట దెబ్బతిన్నా వెరవక తిరిగి సాగు చేపట్టిన రైతులకు పంట చేతికొచ్చినా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించని పరిస్థితులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

1600 ఎకరాలలో మిర్చి సాగు..

నందిగామ మండలంలో 1600 ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేపట్టినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గతేడాది ఆగష్టులో వచ్చిన వర్షాలు, వరదలకు సుమారు 450ఎకరాలలో మిర్చి పంట దెబ్బతింది. దీనికి తోడు నల్లతామర పురుగు, పొడ తెగులు, ఆకుముడత, బొబ్బర తెగులు, వడలు తెగులు వంటి చీడపీడలు పంట దిగుబడులపై ప్రభావం చూపాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల పుణ్యమాని ఎక్కువ శాతం పంట తాలుకాయలుగా మారింది. అంతే కాకుండా గతంలో మూడు, నాలుగు కోతలు కోసే మిర్చి పంట సైతం నల్లతామర పురుగు కారణంగా మొదటి కోతకే పంట పూర్తవుతోందని రైతులు వాపోతున్నారు.



నందిగామలోని శీతల గిడ్డంగులకు తరలుతున్న మిర్చి టిక్కీలు



సోమవరం గ్రామంలో తాలుకాయలు ఏరుతున్న మహిళా కూలీలు

పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు..

మిర్చి పంట సాగు చేసిన రైతులకు ఈ ఏడాది పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఎకరాకు రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టి పంట సాగు చేసినా దిగుబడి మాత్రం ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్లకు మించి వచ్చేలా లేదని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు ధరలు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. గతేడాది తేజ రకం క్వింటాకు 18 వేల వరకు ధర పలుకగా ఈ ఏడాది రూ. 11వేలు కూడా లేదని, సామాన్య రకం మిర్చి గతేడాది క్వింటాకు రూ. 14 వేల ధర పలుకగా ప్రస్తుతం రూ. తొమ్మిది వేలకు కూడా కొనేవారు రావడం లేదంటూ రైతులు కంటతడి పెడుతున్నారు.

మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వం..

చీడపీడలు, తెగుళ్లు, ప్రకృతి ఆటుపోట్లను ఎదుర్కొని పంటసాగు చేసినా తీరా పంట చేతికొచ్చే సమయానికి మద్దతు ధర లేక రైతులు నష్టాలఊబిలో కూరుకుపోతున్నారు. మద్దతు ధర ప్రకటించి అండగా నిలవాల్సిన ప్రభుత్వం కూడా రైతులను పట్టించుకోవడం లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవటంతో దళారుల ఇష్టారాజ్యంగా మారిందని, అయినకాడికి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేద్దామన్నా ధర రాకపోతే ఆ ఖర్చులు అదనం తప్ప ఒరిగేదేమీ లేదని చెబుతున్నారు. కొందరు రైతులు చేసేది లేక మిర్చిపంటను అయినకాడికి తెగనమ్ముకుంటుండగా, మరి కొందరు రైతులు ధర పెరుగుతుందనే ఆశతో శీతల గిడ్డంగులకు తరలిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేలా లేవు..



నేను 1.50 ఎకరాలలో మిర్చి పంట సాగు చేశారు. ఎకరాకు 12 క్వింటాళ్ల మేర కూడా దిగుబడులు రాలేదు. రూ. రెండు లక్షల వరకు పెట్టుబడి ఖర్చులయ్యాయి. ఈ ఏడాది పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు. కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– శీలం శ్రీనివాసరెడ్డి, రైతు

మద్దతు ధర ప్రకటించాలి..



చీడపీడలు, తెగుళ్లతో పాటు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి మిర్చి పంట సాగు చేశాను. క్వింటాకు రూ. తొమ్మిది వేలకు కూడా కొనేవారు రావడం లేదు. అన్ని ఖర్చులు పెరుగుతున్నా మద్దతు ధర మాత్రం పెరగడం లేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ప్రకటించి మిర్చి రైతులను ఆదుకోవాలి.

– పి.మాధవి, మహిళా రైతు

తన్నీరును కలిసిన విగ్రహ కమిటీ సభ్యులు



జగ్గయ్యపేటఅర్బన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటు కోర్ కమిటీ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. హిందూచైతన్య వేదిక ఆధ్వర్యంలో తొర్రగుంటపాలెం కూడలిలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఈనెల 19వ తేదీన నిర్వహించే భూమి పూజల కార్యక్రమానికి హాజరు కావాలని తన్నీరును కోరారు. తన్నీరును కలిసిన వారిలో విగ్రహం ఏర్పాటు కోర్ కమిటీ ప్రతినిధులు పబ్బతి నరేంద్ర, సంక భాస్కర్, తూములూరి అశోక్, రవిచంద్, జగతాప్ విష్ణు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

13న టెండర్ కం బహిరంగ వేలం

నందిగామటౌన్(నందిగామరూరల్): మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో ఈనెల 13న ఆయాహక్కులకు టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ హరిగోపీనాథ్ తెలిపారు. 13న ఉదయం 11 గంటలకు అమ్మవారి ఫోటో ఫ్రేమ్స్, స్టిక్కర్‌లు, వగైరా అమ్ముకునే హక్కుకు, పాలపొంగళ్ల షెడ్డు నిర్వహణ హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాలని ఈఓ కోరారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

నందిగామటౌన్(నందిగామ రూరల్): నిరుపేదలకు ఆర్యవైశ్య సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నార్ల సత్యం తెలిపారు. పట్టణానికి చెందిన సావిత్రమ్మ గుండెజబ్బుతో బాధపడుతుండటంతో వారి కుటుంబానికి సంఘం ఆధ్వర్యంలో రూ.18వేల నగదు, బియ్యం, నిత్యావసర వస్తువులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. దీంతో సంఘం తరఫున తమ వంతు సహకారం అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు యేచూరు రాము, చవట నాగేశ్వరరావు, పబ్బతి సీతారాం గుప్తా, మహంకాళి చంద్రశేఖర్, ఊటుకూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

ఆర్డీఓ కె.బాలకృష్ణ



నందిగామరూరల్: ఎటువంటి అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నిరుపేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. మీ సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులో తీసుకువస్తామన్నారు. జీఓ నంబర్-30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం-2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేపడతామని తెలిపారు. 2019 అక్టోబర్ 15ను ప్రమాణిక తేదీగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణల్లో ఉన్న భూములను నిబంధనలు అనుసరించి క్రమబద్ధీకరిస్తామన్నారు. భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులను ఈఏడాది డిసెంబర్ 31వతేదీ వరకు స్వీకరిస్తామన్నారు. క్రమబద్ధీరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు. క్రమబద్ధీకరణకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కుల జారీ చేస్తామని వివరించారు. భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి వివరాలను నిర్దేశించిన ధృవీకరణ పత్రాలతో మీ సేవ ద్వారా అప్‌లోడ్ చేయాలని ఆర్డీఓ సూచించారు.

సంపూర్ణకు మాజీ ఎమ్మెల్యే నివాళి

కంచికచర్ల: భర్త మృతిని జీర్ణించుకోలేక మనస్తాపానికి గురై మృతిచెందిన అయిలపోగు సంపూర్ణ(85) భౌతికకాయాన్ని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటీవల మృతిచెందిన సంపూర్ణ భర్త, కంచికచర్లకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు అయిలపోగు నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. నాగేశ్వరరావు, సంపూర్ణల ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. సంపూర్ణకు నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, బర్రె ఉదయ్‌కిరణ్ తదితరులు ఉన్నారు.



సంపూర్ణ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

మద్యంషాపుల లాటరీ వాయిదా

కంచికచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈనెల 10వ తేదీన జరగాల్సిన కల్లు గీత కులాల మద్యం షాపుల లాటరీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడినట్లు కంచికచర్ల ఎక్సైజ్ సీఐ షేక్ అఫ్రపున్నీసా బేగం ఆదివారం తెలిపారు. కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ పరిధిలో వీరులపాడు మండలంలోని ఓషాపునకు మొత్తం 27మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. ఈ మద్యం షాపునకు లాటరీ నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆమె వివరించారు.

లాటరీ ప్రక్రియ వాయిదా..

నందిగామటౌన్(నందిగామరూరల్): కల్లుగీత కార్మికుల మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడిందని ఎక్సైజ్ సీఐ బంగార్రాజు తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం జరగాల్సిన లాటరీ ప్రక్రియను ప్రభుత్వం వాయిదా వేసినట్లు వివరించారచు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే లాటరీ నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గమనించాలని ఆయన కోరారు.

875 మందికి వైద్య పరీక్షలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి బొక్కా రవికుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు



మందులు పంపిణీ చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

కంచికచర్ల : మండలంలోని గండేపల్లి ఎంపీపీ స్కూల్‌లో సెంటినీ కర్మాగారం సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో విజయవాడకు చెందిన సెంటినీ ఆసుపత్రి వైద్యులు పాల్గొని 875మంది గ్రామస్తులకు రోగులకు బీపీ, షుగర్, ఎకో, ఊపిరితిత్తులు, గుండె, ఎముకలు, కంటి సంబంధిత వైద్యపరీక్షలు చేశారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేసినట్లు సెంటినీ కర్మాగారం ఏజీఎం హెచ్‌ఆర్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవికుమార్, సెంటినీ ఫ్యాక్టరీ వీపీ ఆపరేషన్ సుసీల్‌గౌడ్, ఏజీఎం సివిల్ శివప్రసాద్, కంపెనీ సిబ్బంది పంచుమర్తి సతీష్, సెంటినీ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

దాములూరు(నందిగామరూరల్): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దాములూరు సర్పంచ్ గాదెల వెంకట రామారావు సూచించారు. దాములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విజయవాడకు చెందిన భవానీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యసిబ్బంది పాల్గొని గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి, అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, గింజుపల్లి శ్రీనివాసరావు, నేలవెల్లి సిద్దార్థ, గాదెల వీరబాబు, వెంకట నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి రథోత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

– పెనుగంచిప్రోలు



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు





అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు

వైభవంగా కల్యాణోత్సవాలు



నందిగామటౌన్(నందిగామ రూరల్): పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని గజలక్ష్మీదేవిగా అలంకరించి కుంకుమార్చనలు పూజలు చేశారు. రాత్రికి స్వామి, అమ్మవారిని శేష వాహనంపై ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారికి ఎదురుకోలోత్సవం, రాత్రి 11.05 గంటలకు అమ్మవారు, స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీరాఘవకుమార్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సంబరాలు



స్వర్ణోత్సవ సంబరాలకు హాజరైన 1974-75 బ్యాచ్ విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని గెంటేల వెంకట జోగయ్య(జీవీజే) జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో 1974-75 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సంబరాలు స్థానిక ఉక్కు కళావేదికలో ఆదివారం ఉత్సాహంగా సాగాయి. పూర్వ విద్యార్థులంతా తమ కుటుంబసమేతంగా తరలివచ్చారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. సమావేశానికి గెంటేల వెంకట జోగయ్య మనుమడు పార్థసారథి, మాజీ ఎంఈవో వెంకటేశ్వరశర్మ, ప్రస్తుత హెచ్‌ఎం ఎ.మాధవీలత, స్వర్ణోత్సవ సంబరాల కన్వీనర్ పసుపుల పుల్లారావు, నిర్వాహకులు మొరిశెట్టి రంగారావు, వీరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.